సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023

ఇఫ్తార్ 6-35
(శుక్రవారం సాయంత్రం)
సహర్ 4-42
(శనివారం ఉదయం)

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

రక్తశుద్ధి కేంద్రంలో ఏసీలకు మరమ్మతులు



రిపేర్ చేయడంతో పనిచేస్తున్న ఏసీలు

సాక్షి ఎఫెక్ట్..

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గల రక్తశుద్ధి కేంద్రంలో ఏసీలను ఎట్టకేలకు అధికారులు మరమ్మతులు చేయించారు. గురువారం సాక్షి దినపత్రికలో 'రక్తశుద్ధికి నరకయాతన' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జీజీహెచ్ అధికారులు స్పందించారు. రక్తశుద్ధి కేంద్రంలోని పాడైపోయిన ఏసీలను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెచ్చారు. దీంతో రక్తశుద్ధి కోసం వచ్చే రోగులకు ఇబ్బందులు తొలగిపోయాయి. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చే రోగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మధ్యాహ్న భోజనం



మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠకుల కోసం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని గురువారం నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చే పాఠకులు మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి బాణోతు బాలమ్మ, జైలర్ జనార్దన్‌రెడ్డి, ఎస్‌ఐ నరేష్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు భోనగిరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంజీయూలో ప్రవీణ్‌కుమార్ పర్యటన

నల్లగొండ టౌన్: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఎంజీ యూనివర్సిటీలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊదరి సైదులు తెలిపారు. గురువారం నల్లగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 9గంటలకు ఎంజీ యూనివర్సిటీలో తలపెట్టిన నిరుద్యోగ సదస్సులో ఆర్ఎస్పీ పాల్గొంటారని పేర్కొన్నారు. మేధావులు, మహిళలు, యువజనులు, నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మహిళా నాయకురాలు ఇంద్రపల్లి కవిత, జిల్లా ఇన్‌చార్జిలు ఆదిమల్ల గోవర్దన్, పంబాల అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు భీంప్రసాద్, సెక్రటరీ వంటెపాక యాదగిరి, కోశాధికారి రంజిత్, మారయ్య, వినోదాచారి, శ్రీనివాస్, లింగస్వామి, నర్సింహ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నల్లగొండ టౌన్: యాసంగి సీజన్ వరి కోతలు ప్రారంభమైనందున జిల్లాలో వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని కారణంగా ధాన్యం తడిసి రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.





జై వీరహనుమాన్

వీరహనుమాన్ జయంతి యాత్రను గురువారం నల్లగొండలోని పాత బస్తీలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఎస్పీ అపూర్వరావు ప్రారంభించారు. ఈ యాత్ర క్లాక్‌టవర్ చౌరస్తా మీదుగా హైదరాబాద్ రోడ్డులో వైభవంగా కొనసాగింది.

మిల్లర్ల మాయాజాలం

అప్పుడే దోపిడీ షురూ..

- రైస్‌మిల్లర్ల సిండికేట్
- ధాన్యం ధర తగ్గించి కొనుగోళ్లు
- మొదట్లో క్వింటాల్‌కు రూ.2,400
- ఇప్పుడు రూ.2,150 వరకు తగ్గింపు
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడమే కారణం
- ఆంధ్రా నుంచి రాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా ఫలితం సున్నా



హాలియాలోని ఓ రైస్ మిల్లు వద్ద ధాన్యం లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లు



మిర్యాలగూడలో మిల్లు వద్ద ఇతర జిల్లాకు చెందిన ధాన్యం లారీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో మిల్లర్ల మాయాజాలం అప్పుడే మొదలైంది. మిల్లుల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమై పదిహేను రోజులు గడువక ముందే కొందరు మిల్లర్లు సిండికేట్‌గా మారి ధర తగ్గించేశారు. మొదట్లో సన్నరకం ధాన్యానికి గరిష్టంగా రూ.2,400 చెల్లించిన మిల్లర్లు ఆ తరువాత ప్రాంతాన్ని బట్టి రూ.2,150కి తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు క్వింటాల్‌కు రూ.250 వరకు నష్టపోతున్నారు. ముఖ్యంగా మిర్యాలగూడ, హాలియా, త్రిపురారం, కోదాడ ప్రాంతాల్లోని పలు మిల్లుల్లో ధాన్యం ధర తగ్గించి కొనుగోలు చేస్తుండటంతో రైతులకు నష్టం తప్పడం లేదు. జిల్లాలోని ఇతర ప్రాంతాలు, ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ధాన్యం వస్తుండటం, జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో మిల్లర్ల ఇష్టారాజ్యంగా ధాన్యానికి ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు.

మిర్యాలగూడకు అధికంగా ధాన్యం

ఆసియా ఖండంలోనే రెండో స్థానంలో ఉన్న మిర్యాలగూడ రైస్ ఇండస్ట్రీకి ఇతర ప్రాంతాల నుంచి లారీల ద్వారా దళారులు పెద్ద ఎత్తున ధాన్యం తరలిస్తున్నారు. తెలంగాణలోని నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో చింటూ, ఎస్ఎల్ఆర్, తెలంగాణ సోనా వంటి సన్నరకం ధాన్యాన్ని పెద్ద ఎత్తున పండించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ యాసంగి సీజన్‌లో పెద్ద ఎత్తున (ఎకరాకు 36 బస్తాలకు తగ్గకుండా) దిగుబడి వచ్చింది. దీంతో ఆయా జిల్లాల నుంచి ధాన్యం లారీల్లో తరలిరావడంతో మన జిల్లాలో పండించిన (సన్నాలు అంకూర్ పూజ, హెచ్ఎంటీతోపాటు చింట్లు, తెలంగాణ సోనా, ఎస్ఎల్ఆర్) పంటకు డిమాండ్ లేక ధర తగ్గిస్తున్నారు. మిల్లర్లు మొదట్లో సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,400 వరకు ధర చెల్లించి కొనుగోలు చేశారు. ఆ తరువాత కొనుగోళ్లు ముమ్మరం కావడం, ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం వస్తుండటంతో ధాన్యం నాణ్యతను బట్టి క్వింటాల్‌కు రూ.250 వరకు తగ్గిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

లారీల్లో తరలిస్తున్న దళారులు..

ఇతర జిల్లాల్లో రైస్ మిల్లులు అంతగా లేకపోవడంతో ధాన్యాన్ని అమ్ముకోవడానికి అక్కడి రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో దళారులు క్వింటాల్ ధాన్యాన్ని రూ.1,400 నుంచి రూ.1,500 కొనుగోలు చేసి లారీల ద్వారా మిర్యాలగూడకు తరలిస్తున్నారు. రవాణా, హమాలీ చార్జీలు పోను క్వింటాల్‌కు రూ.200 నుంచి రూ.300 వరకు మిగిలేలా చూసుకొని మిర్యాలగూడకు తీసుకొచ్చి రైస్ మిల్లుల్లో క్వింటాల్‌కు రూ.2,200 వచ్చినా విక్రయిస్తున్నారు. తక్కువ ధరకే సన్నరకం ధాన్యం రావడంతో స్థానిక రైతుల ధాన్యానికి బదులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ధాన్యాన్ని కొనేందుకు మిల్లర్లు పోటీపడుతున్నారు.

సాధారణ రకానికి భారీగా కోత

జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో సన్నాలతోపాటు సాధారణ రకం ధాన్యం పండించిన రైతులు కూడా మిల్లులనే ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితుల్లో మిల్లుల్లో తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాగర్ ఆయకట్టులోని మండలాల చుట్టుపక్కల గ్రామాల రైతులతోపాటు ఆంధ్రా నుంచి ధాన్యం తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. సాగర్ ప్రాంతంలోని కొన్ని మిల్లుల్లో రూ.2,150 మాత్రమే చెల్లిస్తున్నారు. అలాగే 1010 వంటి సాధారణ రకం ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.2,040 కల్పించగా, మిల్లర్లు క్వింటాకు రూ.1,650 నుంచి రూ.1,700 మాత్రమే చెల్లిస్తున్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు బిల్లులు ఇవ్వకుండా వే బ్రిడ్జి కాంటా బిల్లును చూసి వారి రికార్డు బుక్‌లో రాసుకొని డబ్బులు అందజేస్తున్నారు. కోదాడ నియోజకవర్గంలో వరికోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. సన్న రకాలైన హెచ్ఎంటీ, చింట్లకు రూ.2,400 వరకు చెల్లించిన మిల్లర్లు ఇప్పుడు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఇక 1010 రకం ధాన్యానికి రూ.1,700 మాత్రమే చెల్లిస్తున్నారు. మరోవైపు మిల్లర్లు రైతులకు ఎలాంటి బిల్లులూ ఇవ్వడం లేదు.

పేరుకే చెక్‌పోస్టులు..

ఆంధ్రా నుంచి ధాన్యం రాకుండా వాడపల్లి, రామాపురం క్రాస్ రోడ్డు వద్ద, నాగార్జునసాగర్ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఆ చెక్‌పోస్టులు నామమాత్రంగానే పనిచేస్తున్నాయి. అక్కడ విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందిలో కొందరు చేతివాటానికి అలవాటు పడి రాత్రి వేళల్లో లారీలను మిర్యాలగూడ, కోదాడ, త్రిపురారం వైపు అనుమతిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత సీజన్‌లో వందలాది లారీల ధాన్యం ఆంధ్ర రాష్ట్రం నుంచి తరలి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఈ సీజన్‌లో ముందస్తుగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినా ధాన్యం రాకను అడ్డుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ముందుగా స్థానికంగా పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసిన తరువాతే ఇతర ప్రాంతాల ధాన్యాన్ని కొనాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు.

8న వందే భారత్ రైలు

- నల్లగొండ మీదుగా తిరుపతికి
- వారంలో ఆరు రోజులు అందుబాటులో..
- ప్రతి మంగళవారం బంద్
- సికింద్రాబాద్‌లో ఉదయం 6 గంటలకు స్టార్ట్.. 7.19 గంటలకు నల్లగొండకు..
- శనివారం ప్రజలు చూసేందుకు ఏర్పాట్లు చేసిన రైల్వే శాఖ అధికారులు



నల్లగొండ రూరల్: జిల్లా ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందే భారత్ రైలు ఈనెల 8న జిల్లా మీదుగా తిరుపతికి వెళ్లనుంది. కేవలం ఒక్క నిమిషం మాత్రమే ఈ రైలు నల్లగొండ రైల్వే స్టేషన్‌లో ఆగనుంది. వారం రోజుల్లో కేవలం మంగళవారం మాత్రం వందే భారత్ రైలు నడవదని, మిగతా రోజుల్లో యధాతథంగా నడవనుందని రైల్వే శాఖ అధికారులు స్పష్టం చేశారు. సాధారణ రోజుల్లో సికింద్రాబాద్ నుంచి ఉదయం 6గంటలకు బయలుదేరి నల్లగొండకు ఉదయం 7.19 గంటలకు వస్తుందని, అలాగే తిరుపతికి మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకుంటుంది. కాగా వందే భారత్‌లో తిరుపతి, హైదరాబాద్‌కు వెళ్లేందుకు జిల్లా ప్రజలు సౌకర్యం ఏర్పడింది.

ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం..

ఈ నెల 8న లాంఛనంగా వందే భారత్ రైలును సికింద్రాబాద్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. అదే రోజు ఈ రైలు నల్లగొండ రైల్వేస్టేషన్‌లోకి వచ్చేసరికి మధ్యాహ్నం 12.45 నుంచి ఒంటి గంట మధ్య సమయం పడుతుందని నల్లగొండ రైల్వే స్టేషన్ సూరింటెండెంట్ సుధాకర్ బాబు 'సాక్షి'కి తెలిపారు. జిల్లా ప్రజలు వందే భారత్ రైలును చూసేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాకు చెందిన ఎంపీలు, ఎంమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించారు. ఆ రోజు సాధారణ ప్రజలు కూడా రైల్వేస్టేషన్‌కు రావొచ్చని, ఎలాంటి ప్లాట్‌ఫాం టికెట్ ఉండదని స్పష్టం చేశారు.

ఎనిమిది కోచ్‌లు.. 578 సీట్లు..

వందే భారత్ రైల్‌లో మొత్తం 8 కోచ్‌లు ఉండగా 578 సీట్లు ఉంటాయి. మొత్తం ఏసీ ఉంటుంది. టికెట్ ధర రైల్వే అధికారులు ఇంకా నిర్ణయించ లేదు. తిరుపతి వెళ్లేందుకు ట్రైన్ నంబర్ 20701ను అలాగే తిరుపతి నుంచి సికింద్రాబాద్ వచ్చేందుకు ట్రైన్ నంబర్ 20702ను రైల్వే శాఖ ప్రకటించింది. ఈ నంబర్ ఆధారంగా సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చు. పడుకునేందుకు బెర్త్‌లు ఉండవు. ఈ రైలు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. కానీ, రైల్వే పట్టాల సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకొని 110 కిలోమీటర్ల వేగంతో వెళ్లనుందని అధికారులు పేర్కొన్నారు.

ఏ సమయానికి ఎక్కడికి..

సికింద్రాబాద్ నుంచి వస్తున్న వందే భారత్ ట్రైన్ మంగళవారం మినహా ప్రతిరోజూ నల్లగొండకు ఉదయం 7.19, గుంటూరు 9.45, ఒంగోలుకు 11.09, నెల్లూరుకు మధ్యాహ్నం 12.29, తిరుపతి మధ్యాహ్నం 2.30గంటలకు చేరుకుంటుంది. తిరుపతి నుంచి ట్రైన్ మంగళవారం మినహా సాయంత్రం 3.15 ప్రారంభమై నెల్లూరుకు 5.20, ఒంగోలుకు 6.30, గుంటూరుకు రాత్రి 7.45, నల్లగొండకు 10.10, సికింద్రాబాద్‌కు రాత్రి 11.45 గంటలకు చేరుకుంటుంది.

ఊరూరా బలగం సినిమా

- ప్రతి గ్రామంలో ప్రదర్శన
- చిత్రంలోని సన్నివేశాలు చూసి భావోద్వేగం
- పాత రోజులను గుర్తుకు తెచ్చుకుంటున్న జనం



మర్రిగూడ మండలం వట్టిపల్లిలో బలగం చిత్రాన్ని వీక్షిస్తున్న గ్రామస్తులు

సాక్షి, యాదాద్రి : తెలంగాణ పల్లెల్లోని ప్రతి గడపలో యథార్థ సంఘటనలు కళ్లకు కట్టిన బలగం సినిమా ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎంతో మంది ఆదరాభిమానాలు పొందుతున్న ఈ సినిమాను ఇప్పుడు ప్రతి ఊరిలో ప్రదర్శిస్తున్నారు. స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, పార్టీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రదర్శిస్తున్నారు. ఊరి జనమంతా మూకుమ్మడిగా సినిమాను వీక్షిస్తూ అందులోని సన్నివేశాలకు భావోద్వేగానికి లోనవుతున్నారు. వివిధ కారణాలతో విడిపోయిన కుటుంబాలకు ఈ సినిమా బంధాలను గుర్తుకు తెస్తోంది.

రాజకీయ నాయకులు, పెద్దల సహకారంతో..

తెలంగాణ ప్రజల జీవన విధానం, రక్త సంబంధానికి అద్దంపట్టే విధంగా ఉన్న బలగం సినిమాను ఇప్పటికే చాలా గ్రామాల్లో ప్రదర్శించారు. మిగతా గ్రామాల్లో కూడా ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామ చావిడి, కచ్చీరు, పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి సినిమాను ప్రదర్శిస్తున్నారు. ఇందుకు అయ్యే ఖర్చులను రాజకీయ నాయకులు, స్థానిక పెద్దలు భరిస్తున్నారు. ఇప్పటికే యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేట, భువనగిరి, మోత్కూరు, వలిగొండ, తుర్కపల్లి, యాదగిరిగుట్ట తదితర మండలాలతోపాటు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని పలు మండలాల పరిధిలో గల వివిధ గ్రామాల్లో ఈ సినిమా ప్రదర్శించారు.

పాత రోజులు గుర్తుకు..

బలగం సినిమా పాత రోజులను గుర్తుకు తెస్తోంది. 30 సంవత్సరాల క్రితం ఆది, శనివారాల్లో దూరదర్శన్‌లో వచ్చే తెలుగు సినిమా కోసం.. గురు, శుక్రవారం రోజుల్లో వచ్చే చిత్రలహరి పాటల కోసం జనం ఎదురుచూసేవారు. అప్పట్లో గ్రామ చావడీ వద్ద (పంచాయతీ కార్యాలయం) టీవీలు ఏర్పాటు చేసేవారు. ఆయా కార్యక్రమాలను వీక్షించేందుకు జనం మధ్యాహ్నం నుంచే బస్తాలు, ఈతకమ్మల చాపలు, గన్నీ బ్యాగులు పరచి కొంత చోటును సంపాదించుకునేవారు. అంతేకాకుండా భారతం, భాగవతం, యక్షగానం, బుర్రకథలు, ఒగ్గు కథలు చూడడానికి జనమంతా గ్రామ చావిడీల వద్దకు చేరేవారు. ప్రస్తుతం బలగం సినిమా కూడా పాత రోజులను గుర్తుకు తెస్తుందని ప్రజలు అంటున్నారు.

అనుబంధాలకు ఆయువు పోస్తున్న సినిమా

బలగం సినిమా బంధాలు, అనుబంధాలకు ఆయువు పోస్తోంది. సినిమా ప్రదర్శిస్తున్న చోట భావోద్వేగాలు కట్టలు తెంచుకుంటున్నాయి. ఒక్కో సన్నివేశాన్ని, పాత్రలను తమలో తాము చూసుకుంటున్నారు. చనిపోయిన తండ్రి ముఖాన్ని హత్తుకుని కూతురు రోదించడం, తండ్రి ముఖం మీద వాలిన ఈగలను తోలి, తల వద్ద ఆరిపోతున్న దీపం ఒత్తి సరిచేయడం వంటి సన్నివేశాలతో మహిళలు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు.

రేపు బలగం చిత్ర యూనిట్‌కు ఎంపీ కోమటిరెడ్డి సన్మానం

రామగిరి(నల్లగొండ): భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం నల్లగొండలోని దేవరకొండ రోడ్డులో గల జీఎం కన్వెన్షన్ హాల్‌లో బలగం చిత్ర యూనిట్‌కు పౌర సన్మానం చేయనున్నట్లు కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సినిమా దర్శకుడు వేణు, నిర్మాత దిల్ రాజు, నటీనటులు, ఇతర టెక్నీషియన్లను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా బుడిగెజంగాల కళాకారులు పస్తం మొగిలయ్య, కొమురమ్మ దంపతులకు ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు.

గొర్రెల పంపిణీకి సిద్ధంగా ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అదనపు కలెక్టర్

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ చేయనున్నందున జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌నుంచి సీఎస్ శాంతికుమారి.. వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి గొర్రెల పంపిణీ, అంబేద్కర్ జయంతి వేడుకల నిర్వహణపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ వివరించిన పలు విషయాలను విన్న అనంతరం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వెటర్నరీ డాక్టర్లతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో మొదటి విడత 28,336 మందికి గొర్రెల పంపిణీ చేసినట్లు, రెండో విడతలో గుర్తించిన 37,078 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు లబ్ధిదారులతోపాటు చనిపోయిన వారి నామిని వివరాలు వెరిఫికేషన్ చేయాలన్నారు. లబ్ధిదారుల్లో 4,800 మంది డీడీలు కట్టారని, మిగతా వారు ఒక్కొక్కరూ తమ వాటా కింద రూ.43,750 డీడీలు చెల్లించాలన్నారు. గొర్రెలు ఇతర రాష్ట్రాల నుంచి రవాణాకు టెండర్ పిలిచామని, సోమవారం ప్రొక్యూర్‌మెంట్ జిల్లా కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ యాదగిరి, ఏడీ డాక్టర్ శ్రీనివాస్, డీఆర్‌డీఓ కాళిందిని తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు



ఫణికుమార్‌ను సన్మానిస్తున్న డీఈఓ భిక్షపతి

రామగిరి(నల్లగొండ): పీఆర్‌టీయూ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన డీవీఎస్.ఫణికుమార్ గురువారం నల్లగొండలో డీఈఓ భిక్షపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫణికుమార్‌ను డీఈఓను శాలువా కప్పి సన్మానించారు. అనంతరం పదో తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనంపై డీఈఓకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి, నాయకులు తరాల పరమేష్, కోసనం కరుణాకర్‌రెడ్డి, బోయినపల్లి రమేష్‌బాబు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఇంగ్లిష్ పరీక్షకు 62 మంది గైర్హాజరు

రామగిరి(నల్లగొండ): జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన టెన్త్ ఇంగ్లిష్ పరీక్షకు 62 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 107 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 19,255 మందికి 19,193 మంది హాజరు కాగా 62 గైర్హాజరు అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, తాను వేర్వేరుగా తనిఖీలు చేశామని డీఈఓ భిక్షపతి తెలిపారు.

నకిలీ బిల్లులతో సీఎం సహాయ నిధి స్వాహా!

- హైదరాబాద్‌లో తీగ లాగిన సీసీఎస్ పోలీసులు
- మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కదిలిన నకిలీ బిల్లుల డొంక
- రూ.4.50లక్షలు కాజేసినట్లు వెలుగులోకి..

మిర్యాలగూడ అర్బన్: నకిలీ బిల్లులు సృష్టించి సీఎం సహాయ నిధిని స్వాహా చేసిన సంఘటన మిర్యాలగూడలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఓ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో సూర్యాపేట జిల్లా జాన్‌పహాడ్‌కు చెందిన బి.జ్యోతి, బి.లక్ష్మి, మంగళదుబ్బతండాకు చెందిన ధీరావత్ నరేష్‌లకు సదరు ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నట్లు, అందుకు గాను సీఎం సహాయ నిధికి నకిలీ బిల్లులను సృష్టించి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో సీఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి ఒక్కొక్కరికీ రూ.లక్షా 50వేల చొప్పున ముగ్గురికి మొత్తం రూ.4.50లక్షలు విడుదల చేసింది. కాగా బిల్లులపై అనుమానం వచ్చిన అధికారులు తీగ లాగారు. దీంతో మిర్యాలగూడ ఆస్పత్రి నిర్వాకం బయటపడింది. ఆ బిల్లులను పరిశీలించి అధికారులకు అవి నకిలీవని నిర్ధారణ కావడంతో సీసీఎస్ పోలీసులు ఐపీసీ 420, 468, 471, 120 (బీ) రెడ్ విత్ 34 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సమాచారం. కుట్ర పన్నిన ఆస్పత్రిపై లోతైన విచారణ చేసేందుకు సీసీఎస్ పోలీసులు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

పేర్ల మార్పుపై ఆంతర్యమేమిటి?

కాగా నకిలీ బిల్లులు సృష్టించి సీఎం సహాయ నిధిని స్వాహా చేసిన సదరు మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం నాలుగేళ్లలో మూడు పేర్లు మార్చడం పట్ల సర్వత్రా అనుమానం వ్యక్తమవుతోంది. నకిలీ బిల్లుల వ్యవహారం బయట పడకుండా ఉండేందుకే ఆస్పత్రుల పేర్లు మారుస్తున్నారని అర్థమవుతోంది. పేరు మార్చినప్పుడల్లా అనుమానం రాకపోవడం.. పేరు మార్పునకు దరఖాస్తు చేసుకోగానే జిల్లా అధికారులు అనుమతివ్వడంపైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో సదరు ఆస్పత్రి నిర్వాహకులు నకిలీ బిల్లులతో సీఎంఆర్ఎఫ్ కాజేయడంతో విషయం బయట పడగా స్థానిక నేత సహాయంతో సేఫ్‌గా బయట పడినట్లు సమాచారం. ఏదిఏమైనా దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా

యాదాద్రీశుడికి విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. వేకువ జామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామివారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి, తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ఆలయ మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం, సహస్రనామార్చన గావించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

యాదాద్రిలో వైభవంగా తెప్పోత్సవం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం తొలిసారిగా తెప్పోత్సవాన్ని నిర్వహించారు. చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఈ వేడుకను జరిపినట్లు ఆలయ ఆచార్యులు వెల్లడించారు. ఉత్సవ మూర్తులను ఆలయ మాఢ వీధుల్లో ఊరేగిస్తూ కొండపైన గల విష్ణు పుష్కరిణికి తీసుకొవచ్చారు. అనంతరం పుష్కరిణిలోని మండపం వద్ద స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పుష్కరిణిలో తెప్పోత్సవంగా ఊరేగించారు. ఈ వేడుకలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆచార్యులు, అధికారులు పాల్గొన్నారు.



విష్ణు పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న ఆచార్యులు

సామాజిక సేవలో విద్యార్థులు

- వారం రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు
- ప్రజలను చైతన్యం చేయడంలో ఎన్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 163 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు
- ముగిసిన ప్రత్యేక శిబిరాలు



యాద్గార్‌పల్లిలో వ్యాధులు, మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు



యాద్గార్‌పల్లిలో మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

మిర్యాలగూడ అర్బన్: విద్యార్థులు మార్కుల సాధనే జీవిత లక్ష్యం కాదని సామాజిక స్పృహ కూడా విద్యలో భాగమని నమ్మారు. ఈ లక్ష్యంతో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు 'మా కోసం కాదు– మీ కోసం మేము' అంటూ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పలు సమస్యలపై గ్రామీణ ప్రజలకు వివరిస్తున్నారు. దీంతో కళాశాలల్లో అమలు చేస్తున్న జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సామాజిక స్పృహ, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడుతున్నాయి. సమాజ సేవ చేయాలని అనుకునే యువతకు వేదికగా ఎన్‌ఎస్‌ఎస్ తోడ్పడుతుంది. దీంతో విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో 107 కళాశాలలు ఉండగా వాటిలో 163 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఏర్పాటయ్యాయి. మొత్తం 16,300 మంది వలంటీర్లు గ్రామాల్లో వారం రోజుల పాటు స్పెషల్ క్యాంపు ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగంపై నిర్దేశించిన సర్వే నిర్వహిస్తున్నారు.

పథకం ఉద్దేశం

సామాజిక సేవ కార్యక్రమాల ద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు నాయకత్వ లక్షణాలను చూసినట్లయితే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధించాలనేది ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ప్రజాస్వామ్య విలువలు కాపాడటం, విపత్కర పరిస్థితుల్లో తక్షణం స్పందించడం దేశ చరిత్ర, సాంస్కృతిక వారసత్వ సంపదలను కాపాడటం, బాధ్యతలను పెంచడం.. దేశ సమగ్రతకు కృషి చేయడం, విద్యార్థులు స్వేచ్ఛా సమానత్వం లౌకిక మొదలైన ప్రవేశిక ఆదర్శాల పట్ల గౌరవ భావాలను పెంపొందింపచేయడం వంటి లక్షణాలను అలవర్చుకుంటారు.

విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు

- ఎన్‌ఎస్‌ఎస్ ధ్రువపత్రాలు పొందిన వలంటీర్లకు ఉన్నత విశ్వవిద్యాలయాల్లో రిజర్వేషన్లు లభిస్తాయి.
- ప్రతి ఏటా నిర్వహించే గణతంత్ర వేడుకల్లో ప్రతిభ గల వలంటీర్లు పాల్గొనే అవకాశం కలుగుతుంది.
- ప్రతి సంవత్సరం ఆయా సమయాల్లో జరిగే రాష్ట్ర, జాతీయ స్థాయి ఈవెంట్లలో పాల్గొనే అవకాశం వస్తుంది.
- వలంటీర్లకు స్వయంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభూతి, సంతృప్తి లభిస్తుంది.
- అంతర్ యూనివర్సిటీల్లో జరిగే విశిష్టమైన శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం పొందుతారు. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల ద్వారా విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం, సామాజిక సేవా భావాన్ని అలవర్చుకుంటారు.

సంతోషంగా ఉంది



ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో అక్షరాస్యతతో పాటు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించవచ్చు. అంతే కాకుండా స్వచ్ఛ భారత్, మురుగు కాల్వల శుభ్రత, హరితహారం వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. చదువుతో పాటు సామాజిక సేవలో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉంది.

– ఎస్‌కె. రిజ్వాన, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్

సేవతో పాటు గుర్తింపు



దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. సమాజాభివృద్ధిలో యువత భాగస్వామ్యం చేసే విధంగా ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల్లో పాల్గొనే వలంటీర్లకు క్రమ శిక్షణ అలవడుతుంది. దీనిలో సేవ చేసే అవకాశంతో పాటు మంచి గుర్తింపు లభిస్తుంది.

– మద్దిలేటి, ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ కో– ఆర్డినేటర్

సామాజిక అంశాలపై అవగాహన



విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల్లో పాల్గొంటే ధ్రువపత్రాలు అందజేస్తాం. పనితీరు బాగుంటే గ్రేడింగ్ సర్టిఫికెట్లు అందుకోవచ్చు. వీటి ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో సీట్లు పొందే అవకాశం ఉంటుంది.

– నర్సింగ్ కోటయ్య, కెఎన్‌ఎం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ కో ఆర్డినేటర్

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

నకిరేకల్: మండలంలోని చందంపల్లిలో బావమరదిని హత్య చేసిన కేసులో బావతో పాటు అతడి స్నేహితుడిని గురువారం పోలీసులు రిమాండ్ చేశారు. ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం యండ్లపల్లికి చెందిన యానాల సాయికుమార్ (24) తల్లి భిక్షమమ్మతో కలిసి అమ్మమ్మ ఊరైన నకిరేకల్ మండలంలోని చందంపల్లి గ్రామానికి వచ్చారు. సాయికుమార్ నిత్యం మద్యం సేవిస్తూ తల్లి భిక్షమమ్మతో తరచూ గొడవ పడుతుండడంతో ఆమె హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో ఉంటున్న తన అల్లుడు యారాల విజయ్‌కుమార్‌రెడ్డికి ఫోన్‌లో విషయం చెప్పింది. దీంతో ఈ నెల 3న యారాల విజయ్‌కుమార్‌రెడ్డి తన స్నేహితుడు బాణాల వెంకట్‌రెడ్డిని తీసుకుని చందంపల్లి వచ్చి సాయికుమార్‌తో గొడవ విషయమై మాట్లాడారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటామట పెరిగి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో సాయికుమార్ తలపై విజయ్‌కుమార్‌రెడ్డి పారతో కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సాయికుమార్‌ను నకిరేకల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు యారాల విజయ్‌కుమార్‌రెడ్డి, అతడి స్నేహితుడు బాణాల వెంకట్‌రెడ్డిని గురువారం అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వరికోత మిషన్ కింద పడి రైతు మృతి



ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కనగల్: వరికోత మిషన్ కింద పడి రైతు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని జంగమయగూడెం గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ అశోక్ రెడ్డి, ఎస్‌ఐ నాగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జంగమయగూడెం గ్రామానికి చెందిన నూనె సోమయ్య(70) బుధవారం సాయంత్రం వరికోత మిషన్‌ను పిలిపించి తన వరి పంటను కోపిస్తున్నాడు. వరికోత మిషన్ వెనక సోమయ్య వరి పరిగెలను కోస్తున్న క్రమంలో మిషన్ డ్రైవర్ నల్లబోతు రాములు అతివేగం, అజాగ్రత్తతో నడిపి సోమయ్యపై వెనుక టైర్ ఎక్కించడంతో చాతి భాగంలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. పక్కనే ఉన్న సోమయ్య కుమారుడు సైదులు గమనించి వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. గురువారం మృతుడి కుమారుడు సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి, వరికోత మిషన్ ను సీజ్ చేసి, వరికోత మిషన్ డ్రైవర్ రాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

నీటి కాలుష్యాన్ని అరికట్టాలి



ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లో ప్రవహిస్తున్న కలుషిత నీరు

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని వేపలసింగారం వద్ద గల ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కెమికల్స్ కలపడంతో నీరు కలుషితమై నలుపు రంగులో వస్తున్నాయని గ్రామస్తులు, రైతులు తెలిపారు. గురువారం పలువురు రైతులు తమ వ్యవసాయ పొలాల వద్దకు నీరు పెట్టడానికి వెళ్లగా నీరు నలుపు రంగులో రావడంతో అవాక్కయ్యారు. దీంతో ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ వద్దకు వెళ్లి చూడగా నీరు నలుపు రంగులో వస్తున్నాయని గుర్తించి వెంటనే పొలాలకు నీరు పెట్టడం బంద్ చేశారు. నీటిలో కెమికల్స్ కలిపిన వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పుట్టెడు దుఃఖంలో పరీక్షకు హాజరైన విద్యార్థిని



ఎస్సెస్సీ పరీక్షాకేంద్రం వద్ద మాదగోని కీర్తన

శాలిగౌరారం: ఇంట్లో తండ్రి మృతదేహం ఉన్నప్పటికీ భవిష్యత్‌ను నిర్ణయించే ఎస్సెస్సీ పరీక్ష కావడంతో పుట్టెడు దుఃఖంలో ఓ విద్యార్థిని గురువారం ఎస్సెస్సీ పరీక్షకు హాజరైంది. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన మాదగోని సైదులు(39) రెండవ కుమార్తె కీర్తన స్థానికంగా మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతోంది. మండల కేంద్రంలో జరుగుతున్న ఎస్సెస్సీ పరీక్షలు రాస్తుంది. అయితే, కీర్తన తండ్రి సైదులు బుధవారం రాత్రి బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురికావడంతో కుటుంబ సభ్యులు నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతిచెందాడు. వెంటనే సైదులు మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. ఇంట్లో తండ్రి మృతదేహం ఉండగా.. పరీక్షకు వెళ్లలేక శోకసంద్రంలో ఉన్న కీర్తనను బంధువులు ఓదార్చి పరీక్షకు వెళ్లేలా మనోధైర్యం కల్పించారు. దీంతో గురువారం ఉదయం పరీక్షకు హాజరై.. తిరిగి వెళ్ళిపోయి తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంది. కాగా, కీర్తన తండ్రి సైదులు అంత్యక్రియలు గురువారం సాయంత్రం జరిగాయి. కీర్తన సోదరి సోని తలకొరివి పెట్టి దహన సంస్కారాలు నిర్వహించింది.

తండ్రీకూతురు ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలిస్తుండగా తండ్రి మృతి



తండ్రి లతీఫ్‌తో కూతురు హసీనా

పాలకవీడు: కుటుంబ కలహాలతో తండ్రీకూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో తండ్రి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని గుడుగుంట్లపాలెంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన షేక్ లతీఫ్(40) కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉండగా, జనవరి 3న కుమారుడు నాగుల్ మీరా ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి లతీఫ్ పనికి వెళ్లకుండా మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. కొద్దిరోజుల క్రితం ఉపాధి నిమిత్తం లతీఫ్ కుటుంబ మిర్యాలగూడకు వెళ్లి అక్కడే ఉంటున్నారు. కాగా వారం క్రితం లతీఫ్ భార్యతో గొడవపడి కూతురుతో కలిసి స్వగ్రామానికి వచ్చి ఉంటున్నాడు. ఈ నెల 5వ తేదీన లతీఫ్, హసీనా మళ్లీ మిర్యాలగూడలో ఉంటున్న లతీఫ్‌బీ దగ్గరకు వెళ్లగా అక్కడ ముగ్గురికి మరోసారి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన తండ్రీకూతురు గుడగుంట్లపాలెం వచ్చి గురువారం కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు గుర్తించి మిర్యాలగూడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో లతీఫ్ మృతిచెందాడు. హసీనా మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. హసీనా చిన్నమ్మ షేక్ లాల్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అక్రమంగా గోవులు తరలిస్తున్న వాహనాల పట్టివేత

చౌటుప్పల్: అక్రమంగా గోవులు, పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను గురువారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాలోని కిలారి గ్రామం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే 54 గోవులు, పశువులు కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని బహదూర్‌పురాలోని కబేళాకు డీసీఎంలో తరలిస్తుండగా మండలంలోని ధర్మోజిగూడెం గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ సమీపంలో గల హనుమాన్ జంక్షన్‌లో 50పశువులను కొనుగోలు చేసి కంటైనర్ వాహనంలో హైదరాబాద్‌లోని బహదూర్‌పురాలోని కబేళాకు తరలిస్తుండగా తెల్లవారుజామున వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు వాహనాన్ని గుర్తించి పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, పట్టుబడిన గోవులు, పశువులను గోశాలలకు తరలించామని పోలీసులు తెలిపారు.

ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

దేవరకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం దేవరకొండలోని పల్లా పర్వత్ రెడ్డి భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయాలని ఈనెల 16న డిండి మండల కేంద్రం నుంచి ఇంటింటికీ సీపీఐ అనే నినాదంతో ప్రారంభం కానున్న బైక్ జాతాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు నేటికీ తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఇంటి స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, స్థలం లేని వారికి ప్రభుత్వమే స్థలం కేటాయించి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ, గిరిజన సమాఖ్య నాయకులు రమావత్ అంజయ్యనాయక్, పల్లె నర్సింహ, పల్లా దేవేందర్‌రెడ్డి, తూం బుచ్చిరెడ్డి, పార్లపల్లి కేశవరెడ్డి, కనకాచారి, పోలె వెంకటయ్య, యాసాని పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



చౌడంపల్లి నర్సరీలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నార్కట్‌పల్లి : పదో తరగతి పరీక్షల నిర్వహణ విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలతో పాటు చౌడంపల్లి గ్రామంలో కంటివెలుగు శిబిరం, నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు కేంద్రాల వద్ద బ్యానర్లు పెట్టకపోవడంతో పాటు నర్సరీల నిర్వహణ విషయంలో అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ పులి సైదులు, ఎంపీడీఓ యాదగిరి తదితరులు ఉన్నారు.

అన్నెపర్తిలో నర్సరీ పరిశీలన

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలం అన్నెపర్తి గ్రామ నర్సరీని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పరిశీలించారు. నర్సరీ వద్ద ఆర్చి ఏర్పాటు చేయాలని ఎంపీడీఓకు సూచించారు.శ్మశానవాటికను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ మేకల అరవింద్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో లక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చన చేపట్టారు. అదే విధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం, పంచగవ్యప్రాశన, మధుఫర్కపూజ, మాంగల్యధారణ జరిపించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

నార్కట్‌పల్లి: బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం సాయంత్రం మండలంలోని నెమ్మాని గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చినతుమ్మలగూడెం గ్రామానికి చెందిన బండారు రవీందర్‌రెడ్డి నార్కట్‌పల్లి నుంచి చిన తుమ్మలగూడేనికి బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో నెమ్మాని గ్రామ సమీపంలో అతివేగంగా వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బండారు రవీందర్‌రెడ్డికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

చౌటుప్పల్ మండలంలో వృద్ధురాలు..

చౌటుప్పల్: మండలంలోని దండుమల్కాపురం గ్రామపంచాయతీ మధిర గ్రామమైన బొర్రోళ్లగూడెం శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. వివరాలు.. రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన సంగిశెట్టి శకుంతల(70) కొంతకాలంగా పోచంపల్లి మండలం మెహర్‌నగర్ శివారులోని మాణిక్యేశ్వరీమాత దేవాలయ ఆవరణలో గల ఆశ్రమంలో ఉంటుంది. బుధవారం రాత్రి పని నిమిత్తం ఆశ్రమంలోనే ఉంటున్న మరో వృద్ధురాలు అయిటి పాముల విజయమ్మతో కలిసి శకుంతల హైదరాబాద్‌కు వెళ్లేందుకు బొర్రోళ్లగూడెం జాతీయ రహదారి వద్దకు చేరుకున్నారు. అక్కడ హైవే దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ శకుంతలను ఢీకొట్టింది. విజయమ్మ ముందుగానే హైవే దాటడంతో ఆమె ప్రమాదం తప్పింది. కాగా తీవ్రంగా గాయపడిన శకుంతలను చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతురాలి బంధువు కళమ్మ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సీత పాండు తెలిపారు.

దిర్శించర్లలో వరికోత మిషన్ ఢీకొట్టి..

నేరేడుచర్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం రాత్రి మండలంలోని దిర్శించర్లలో చోటు చేసుకుంది. నేరేడుచర్ల ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దిర్శించర్ల గ్రామానికి చెందిన యాతవాకిళ్ల లచ్చయ్య(56) టీవీఎస్ ఎక్సెల్‌పై గ్రామానికి వెళ్తుండగా వరికోత మిషన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లచ్చయ్యకు తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి ముఠాను వెంటాడి పట్టుకున్న పోలీసులు



నిందితుడిని వెంటాడి పట్టుకున్న మునగాల సీఐ ఆంజనేయులు, సిబ్బంది



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

- సహకరించిన హైవే పెట్రోలింగ్ పోలీసులు, స్థానిక యువత
- 120 కేజీల గంజాయి స్వాధీనం

మునగాల(కోదాడ): గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను గురువారం మునగాల శివారులో స్థానికులు, పోలీసులు వెంటాడి మరీ పట్టుకున్నారు. వివరాలు.. మునగాలలో స్థానిక సీఐ పి. ఆంజనేయులు తమ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారు రోడ్డుపై ఏర్పాటు చేసిన రెండు స్టాపర్లను ఢీకొట్టి ఆగకుండా వెళ్తుండగా వెంటాడి మరీ ఆపారు. కారులో తనిఖీ చేయగా సుమారు 120కేజీల గంజాయి దొరికింది. కారులోని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుంటుడగా అందులో ఒకరు పోలీసుల కళ్లుగప్పి పారిపోయే ప్రయత్నం చేశాడు. దీంతో సీసీఐ ఆంజనేయులు తన సిబ్బందితో పారిపోతున్న వ్యక్తి వెంటపడ్డారు. చివరకు హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై చివ్వెంల మండలం గుంజలూరు వద్ద పారిపోతున్న వ్యక్తిని హైవేపై పెట్రోలింగ్ చేస్తున్న పోలీసు సిబ్బంది, స్థానిక యువకుల సాయంతో అదుపులోకి తీసుకున్నారు. కాగా శుక్రవారం ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై సీఐ ఆంజనేయులును వివరణ కోరగా ఆయన గంజాయి పట్టుబడినట్లు ధృవీకరించారు. సీఐ వెంట మునగాల ఎస్‌ఐ పి. లోకేష్, సిబ్బంది ఈశ్వర్, సుదర్శన్ ఉన్నారు.